క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల కార్యాలయం ప్రారంభం

రాయవరం: వైఎస్సార్ సీపీ రాయవరం మండల కార్యాలయం బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట త్రిమూర్తులు చేతులమీదుగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఘనంగా భక్తాంజనేయ స్వామి ఆలయ శత వసంత వేడుక



మండపేటలో భక్తాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న దుర్గారాణి, పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం: భక్తాంజనేయ స్వామి ఆలయ శత వసంత వేడుక పట్టణంలో మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ హాజరై, స్వామిని దర్శించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, వార్డు ఇన్‌చార్జి మీగడ శ్రీనివాస్, నాయకులు కొమ్ము రాంబాబు, కొల్లా శ్రీనివాస్ ఉన్నారు.

పంపిణీకి హెల్త్ కార్డులు సిద్ధం



కపిలేశ్వరపురంలో ఆయుష్మాన్ భారత్ కార్డులను అందజేస్తున్న ఎంపీడీఓ

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో లబ్ధిదారులకు అందజేసేందుకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను వైద్య, ఆరోగ్య సిబ్బందికి ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునరావు, ఇతర వైద్య, ఆరోగ్య కార్యకర్తలకు కార్డులను అందించారు. త్వరితగతిన లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేసి, వినియోగంలోకి తేవాలని ఎంపీడీఓ ఆదేశించారు.

గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అభిరామ్

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్స్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కుడారి తిరుపాలు ఆదేశాల మేరకు జిల్లా చైర్మన్ అభిరామ్ ఆహార పదార్థాల్లో నాణ్యత ప్రమాణాలు గుర్తించడం, వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పెద్దలను, మహిళలను గౌరవించడం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నాణ్యత లేని ఆహారంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం



రక్త దాతలకు కిట్లను అందిస్తున్న మూర్తి

రామచంద్రపురం: యువత రక్తదానంపై అవగాహన కలిగిఉండాలని రక్త దాతల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. పట్టణంలో ఆర్బోస్ సాఫ్ట్ డ్రింక్స్ కంపెనీ కార్మికులకు మంగళవారం రక్తదానంపై అవగాహన, అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల బలహీనత రాదని చెప్పారు. యువత నుంచి 65 ఏళ్ల ఆరోగ్యవంతులైన వ్యక్తులు రక్తదానం చేయవచ్చని తెలిపారు. గతంలో రక్తం కావాలంటే సుదూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ ప్రయాసలు పడేవారన్నారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చొరవతో పట్టణంలో ఏరియా ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేశారని చెప్పారు. కాకినాడ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ కౌన్సిలర్ పి.అప్పలరాజు, గవర శ్రీనివాస్, ఫ్యాక్టరీ జీఎం మోహన్‌రాజు, బ్యాంకు ఉద్యోగులు మాట్లాడారు. ఈ సందర్భంగా 20 మంది కార్మికులు ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తదానం చేస్తామని 45 మంది కార్మికులు మొబైల్ నంబర్లు ఇచ్చారు. రక్తదానం చేసిన వారికి బహుమతులు ఇచ్చారు. సంస్థ అధినేత జగన్నాథ వర్మ, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరభద్రుడు పాల్గొన్నారు.

వెతలకు సెలవు

- సబ్ స్టేషన్ నిర్మాణంతో కరెంటు కష్టాలకు శాశ్వత పరిష్కారం
- సోమేశ్వరంలో రూ.2.68 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం
- త్వరలో ప్రారంభించనున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు



సోమేశ్వరంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సబ్‌స్టేషన్

రాయవరం: దశాబ్దాలుగా నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా కోసం ఎదురు చూస్తున్న సోమేశ్వరం విద్యుత్ వినియోగదారుల సమస్యలకు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. సోమేశ్వరం గ్రామ ప్రజల విద్యుత్ కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. మండలంలోని సోమేశ్వరంలో 32 కేవీఏ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. విద్యుత్ సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో.. నిధుల మంజూరు వేగవంతమైంది.

దశాబ్ద కాల నిరీక్షణ

సోమేశ్వరం, మాచవరం గ్రామానికి రాయవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరిగేది. పొలాల మీదుగా ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్ ద్వారా సోమేశ్వరం, మాచవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేవారు. వర్షాలు, తుఫాన్లు, ఈదురుగాలుల సమయంలో విద్యుత్ లైన్లలో ఏర్పడే సాంకేతిక లోపాలతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. కొద్దిపాటి గాలులకే విద్యుత్ లైన్లలో ఏర్పడే సాంకేతిక సమస్యలతో సరఫరాలో అంతరాయంతో పాటు, నాణ్యమైన విద్యుత్ లభించేది కాదు. లోఓల్టేజి సమస్య కూడా తీవ్రంగా ఉండేది. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గుల కారణంగా వినియోగదారులు సతమతమయ్యేవారు. ఈ నేపథ్యంలో సోమేశ్వరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ దశాబ్దకాలంగా నెలకొంది. 2018లో సాధారణ ఎన్నికలకు ముందు అప్పటి మంత్రి కిమిడి కళావెంకట్రావు చేతులమీదుగా హడావిడిగా దీనికి శంకుస్థాపన చేశారు. అయినప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

రూ.2.68 కోట్లతో నిర్మాణం

ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాకు ఎదురు చూస్తున్న తరుణంలో సర్పంచ్ ఆరిఫ్ ఈ సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన త్రిమూర్తులు సబ్‌స్టేషన్ నిర్మాణానికి చేసిన కృషి ఫలించింది. ఫలితంగా 33 కేవీఏ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.68 కోట్లు మంజూరు చేసింది. దీంతో మార్కెట్‌ను ఆనుకుని ఉన్న పంచాయతీకి చెందిన 40 సెంట్ల స్థలాన్ని పంచాయతీ తీర్మానం చేసి, విద్యుత్ శాఖ అధికారులకు అప్పగించారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ఈ ఏడాది ఫిబ్రవరి ఏడున ఎమ్మెల్సీ త్రిమూర్తులు భూమిపూజ చేసి ప్రారంభించారు. శరవేగంగా జరిగిన నిర్మాణ పనుల కారణంగా సబ్‌స్టేషన్ ప్రారంభానికి సిద్ధమైంది. త్వరలోనే సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించనున్నారు.



అభివృద్ధి బాట పట్టింది

సోమేశ్వరం గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కోరిక తీరనుంది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కృషి కారణంగా గ్రామం అభివృద్ధి బాట పట్టింది. లోఓల్టేజి సమస్య తీరడంతో పాటు, రెండు గ్రామాల ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందనుంది. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షం చేసిన కుట్ర ఫలించలేదు.

– ఆరిఫ్, సర్పంచ్, సోమేశ్వరం, రాయవరం మండలం

వైఎస్సార్ బీమా సొమ్ము అందజేత



బీమా సొమ్మును అందిస్తున్న సర్పంచ్ రమణ

కె.గంగవరం: దంగేరు గ్రామానికి చెందిన యంటపల్లి దుర్గారావు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వారి కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం ద్వారా రూ.లక్ష మంజూరైంది. తక్షణ సాయంగా రూ.10 వేలను సర్పంచ్ కొప్పిశెట్టి రమణ బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఉప సర్పంచ్ దారా సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన సదస్సులు

రామచంద్రపురం: ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు ఏరియా ఆస్పత్రి రామచంద్రపురం ఐసీటీసీ కౌన్సిలర్ శిరీష, వెంకటలక్ష్మి వెల్లడించారు. మంగళవారం గుబ్బలవారిపేటలోని నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిసెంబర్ 1వ తేదీ వరకు సదస్సులు నిర్వహించనున్నట్టు చెప్పారు.

అభివృద్ధి పథంలో నియోజకవర్గం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో రూ.2.40 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం



ఏడిదలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తున్నారని, అదే ఒరవడితో నియోజకవర్గం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట మండలం ఏడిదలో రూ.2.40 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎమ్మెల్సీ శంకుస్థాపన చేశారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, జెడ్పీటీసీ కురుపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, గ్రామ నాయకులతో కలిసి ఎమ్మెల్సీ గ్రామంలో పర్యటించారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ తోటను ఘనంగా సత్కరించారు. రూ.6 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులు, దేవుడి కాలనీలో రూ.2.29 కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులతో మంచినీటి పథకంలో పలు నిర్మాణ పనులు, రూ.5 లక్షలతో ధోబీ ఘాట్ నిర్మాణం, రజక చెరువు ఫెన్సింగ్, గ్రావెల్ రహదారి, చేతి పంపు, ధోబీ ఘాట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

అందరితో కలిసి ముందుకు సాగుతూ..

గ్రామ ప్రజాప్రతినిధుల చొరవతో గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. మండపేట పట్టణానికి సమీపాన ఉన్న ఏడిద గ్రామాన్ని మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వేగుళ్ల జోగేశ్వరరావు విస్మరించారన్నారు. కుల, మత, ప్రాంతీయ, రాజకీయ భావాలకు అతీతంగా అందరితో కలిసి ముందుకు సాగుతున్నామన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. రానున్న ఎన్నికల్లో డబ్బుతో గెలవాలనుకునే వారిని తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాజకీయమంటే సామాన్య ప్రజలకు తోడునీడగా ఉండటమని తాను భావిస్తానన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, జెడ్పీటీసీ కురుపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్సీ తోట చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఐదం రాజు, కార్యదర్శి వుండమట్ల వీర్రాజు, ఎంపీటీసీ పట్నాల నాగబాబు, చొల్లంగి రామారావు, తాతపూడి ఉషారాజేష్, ఉప సర్పంచ్ చంద్ర శ్రీను, పార్టీ గ్రామ అధ్యక్షుడు పలివెల సుధాకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమ సారథి సీఎం జగన్

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ తోట



కపిలేశ్వరపురం గ్రామస్తులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమ సారథిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. కపిలేశ్వరపురంలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ పర్యటించారు. ఆయనకు గ్రామస్తులు పూలదండలతో స్వాగతం పలికారు. మహిళలు హారతి పట్టారు. ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల బంగారం, సచివాలయ ఉద్యోగులు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని కుటుంబాల వారీగా వివరించారు. సాంకేతిక సమస్యలతో లబ్ధి దక్కకపోతే, వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామంలో ఎమ్మెల్సీ తోట తనయుడు, యువనేత పృథ్వీరాజ్ పర్యటించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, పార్టీ నాయకులు అరదాని శ్రీదేవి, పిప్పర సంపతరావు, క్రైస్తవ బోధకులు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రగతి



పసలపూడిలో బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



దంగేరులో పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు అన్నారు. మాచర సచివాలయం వద్ద మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం జరిగింది. సర్పంచ్ వాసంశెట్టి సునీత అధ్యక్షత వహించారు. మండల సాగు సలహా మండలి సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ కర్రెడ్ల శ్రీనుబాబు, ఉప సర్పంచ్ అడపా వేణు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కె.గంగవరం: కులం, మతం, పార్టీ బేధాల్లేకుండా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందాలంటే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే రావాలని మండల పరిషత్ విప్, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్ అన్నారు. మండలంలోని దంగేరు గ్రామంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం పంచాయతీ వద్ద జరిగింది. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు తన వారికే సంక్షేమం అందించాలని అధికారులకు ఆదేశించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక పార్టీలకతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమం అందిస్తున్నారని చెప్పారు. గ్రామసభ అనంతరం గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, ప్రజలకు సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొప్పిశెట్టి రమణ, ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ దారా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాచర సమావేశంలో జెడ్పీటీసీ, ఇతర ప్రజాప్రతినిధులు

పసలపూడిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

రాయవరం: గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణలు పేర్కొన్నారు. మండలంలోని పసలపూడిలో సర్పంచ్ కడలి పద్మావతి ఆధ్వర్యంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడానికి సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఉన్నాయనే విశ్వాసాన్ని వారికి ఇచ్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా, సంక్షేమ పథకాలు అందించడంతో ప్రజల్లో వైఎస్సార్ సీపీకి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. సీఎం జగన్ అంటే ప్రజలకు ధీమా, భరోసా లభిస్తోందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు అమలు చేస్తున్న పథకాలే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్షగా వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి, సంక్షేమ బోర్డులు, పార్టీ పతాకాన్ని, బుక్‌లెట్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కర్రి విజేత, కోట శ్రీలక్ష్మి, పార్టీ గ్రామ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణరెడ్డి, పార్టీ నేతలు నల్లమిల్లి వెంకటరెడ్డి, వెలగల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



మారేడుబాకలో పథకాలను వివరిస్తున్న నాయకులు

అర్హతే ఆధారంగా సంక్షేమం

కపిలేశ్వరపురం (మండపేట): అర్హతే ఆధారంగా పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందని మండపేట మండలం మారేడుబాకలో మంగళవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. సర్పంచ్ మట్టపర్తి గోవిందురాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల వాసు, జెడ్పీటీసీ కురుపూడి భవాని, పార్టీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు మాట్లాడుతూ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. సచివాలయాల మండల కన్వీనర్ బందెల సాయిరామ్, ఉప సర్పంచ్ టి.దుర్గారావు, గ్రామ సచివాలయాల కన్వీనర్లు గండి రాజ్‌కుమార్, కొండపల్లి రాజేంద్రప్రసాద్, కాళ్ల ఎస్తేర్‌రాణి, పార్టీ నాయకులు టి.చిరంజీవి, సుంకర రాజు, కె.మాచరయ్య, ఎం.శేఖర్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా వన సమారాధనలు



పాన్‌షాప్ సంఘ వన సమారాధనలో పాల్గొన్న నాయకులు

రామచంద్రపురం: పట్టణ పాన్‌షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘ కార్యాలయం వద్ద మంగళవారం కార్తిక వన సమారాధన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు పడాల సూరిబాబు మాట్లాడుతూ పాన్ షాప్ యజమానుల సమస్యల పరిష్కారానికి సంఘ పరంగా కృషి చేస్తున్నట్టు వివరించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కొవ్వూరు తాతారెడ్డి, నల్లమల్లి జనార్దన్ రెడ్డి, కంచుమర్తి బాబురావు, పుసుపులేటి సత్తిబాబు తదితరులను సంఘం తరఫున ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు సిరిగినీడి ఫణి, కార్యదర్శి సిరిగినీడి దుర్గాప్రసాద్, ట్రెజరర్ మండ రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో..

పట్టణ నాయీ బ్రాహ్మణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కార్తిక వనమహోత్సవం ఘనంగా జరిగింది. రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ నాయీ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కాజ జగన్నాథం, ఉపాధ్యక్షులుగా పెదపూడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా బల్లిపాటి జానీ, సహ కార్యదర్శిగా వద్దిపర్తి సతీష్, కోశాధికారిగా పేలూరు శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

దాళ్వా సాగుకు చొరవ చూపాలి

కాకినాడ జేడీఏ విజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ విజయ్‌కుమార్

కాజులూరు: దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలని కాకినాడ జేడీఏ ఎస్ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయాధికారులు రైతులకు సమావేశం ఏర్పాటు చేశారు. పంటల సాగు కాల మార్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోలంకలో ఏఓ వి.అశోక్ అధ్యక్షతన జరిగిన సభలో విజయ్‌కుమార్ మాట్లాడుతూ గోదావరిలో నీటి నిల్వలు తగినంత లేనందున, ఈ ఏడాది దాళ్వాలో సాగునీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. రైతులు త్వరితగతిన సాగు చేపట్టకుంటే, సాగునీటి సమస్య తలెత్తుతుందని హెచ్చరించారు. కనీసం డిసెంబర్ తొలివారం నాటికైనా పూర్తి స్థాయిలో వెదచల్లికలు, నాట్లు పూర్తి చేయాలన్నారు. సాగుకు సమయం తక్కువగా ఉన్నందున రైతులు వెదచల్లిక విధానానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. తక్కువ రోజుల్లో కోతకు వచ్చే వరి వంగడాలను ఎంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కరప ఏడీఏ బాబురావు, సర్పంచ్‌లు సరాళ బాలరాజు, దేగల తిరుమలవేణి, పీఏసీఎస్ అధ్యక్షుడు రేమళ్ల చిట్టియ్యదొర, కొప్పుశెట్టి స్వామినాయుడు పాల్గొన్నారు.

అవగాహనతో పశువుల పెంపకం మేలు

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకట్రావు



వల్లూరులో పాడి రైతులకు మందులను అందజేస్తున్న వెంకట్రావు

కపిలేశ్వరపురం: అవగాహనతో పశువులను పెంచడం ద్వారా మేలైన ఫలితాలను రాబట్టవచ్చని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా.కె.వెంకట్రావు అన్నారు. వల్లూరులో మంగళవారం నిర్వహించిన రాజన్న పశు విజ్ఞాన బడిని ఆయన సందర్శించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి పరిశ్రమాభివృద్ధికి విశేష కృషి చేస్తోందన్నారు. పశు విజ్ఞాన బడి నిర్వహణతో పశు పోషణ పద్ధతులపై పాడి రైతులకు అవగాహన కలుగుతుందన్నారు. రైతులు అడిగిన పలు సందేహాలను ఆయన నివృత్తి చేశారు. సహాయ సంచాలకులు డా.ఎల్.అనిత, పశువైద్యాధికారి డా.వీవీ రమణమూర్తి మాట్లాడుతూ స్థానికంగా పశుపోషణ పద్ధతులు, ప్రభుత్వ పథకాలను వివరించారు. పశువుల వినియోగార్థం మందులను పాడి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకుడు గంజా రాజేష్, రైతులు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి ఫూలే

వర్ధంతి సందర్భంగా ప్రముఖుల నివాళి



కపిలేశ్వరపురంలో ఫూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కపిలేశ్వరపురం: సమాజ ప్రగతికి చోదక శక్తిగా జ్యోతిరావ్ ఫూలే చరిత్రలో నిలిచారని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం ఫూలే వర్ధంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆయన నిలువెత్తు విగ్రహానికి బీసీ, సామాజిక, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు జిత్తుక మల్లికార్జునుడు, గుత్తి నాగేశ్వరరావు, కుడుపూడి విజయ్, అంగాని నూకరాజు మాట్లాడుతూ వెనుకబడిన తరగతులకు ఆశాజ్యోతిగా ఫూలే నిలబడ్డారన్నారు. విద్య ద్వారా సమాజాన్ని ప్రగతి మార్గాన నడిపించవచ్చన్న సత్యాన్ని నిర్దేశించిన ఘనత ఫూలేదన్నారు. మండలంలోని 19 గ్రామాల సచివాలయాల్లో ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ఫూలేకు నివాళులర్పించారు.

మండపేటలో..

కులవివక్ష, అంటరానితనాన్ని రూపుమాపేందుకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా ఫూలే అని మండపేటలో జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు కోన సత్యనారాయణ, పిల్లి గణేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు వీరమల్లు శ్రీనువాసు, పెంకె గంగాధరరావు, సూర్యప్రకాష్, గణపతిరావు పాల్గొన్నారు.



ద్రాక్షారామలో ఫూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ నాయకులు

మైనార్టీ బీసీ నేతల ఆధ్వర్యంలో..

రామచంద్రపురం రూరల్: మహాత్మా జ్యోతీరావ్ ఫూలే వర్ధంతి సందర్భంగా ద్రాక్షారామలో ఆయన విగ్రహానికి మంగళవారం బీసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మైనార్టీ బీసీ సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఫూలే సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వేమవరపు రాంబాబు, కణితి రాంబాబు, గారోజు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అపాయకరంగా మారిన విద్యుత్ తీగలు



కాజులూరు రోడ్‌లో వరికోత యంత్రానికి తగలకుండా విద్యుత్ తీగలను తప్పిస్తున్న లారీ క్లీనర్

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, కుయ్యేరు రహదారిలో కాజులూరు, కుయ్యేరుల వద్ద విద్యుత్ స్తంభాలు తక్కువ ఎత్తులో ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రహదారి అభివృద్ధిలో భాగంగా అనేక చోట్ల విద్యుత్ స్తంభాలు కుంగిపోయాయి. దీంతో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ, వాహనాలను తాకుతున్నాయి. ఊక, గడ్డి లారీలు వెళ్లే సమయంలోనూ, పొక్లెయిన్లు వంటి మెషీన్లను లారీలపై తరలించే సమయంలోనూ విద్యుత్ తీగలు తగులుకోవటంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. కొన్నిసార్లు నిప్పురవ్వలు రాలుతుండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.